## ఇంటింటా మొక్కలు నాటాలి


మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత

మెట్‌పల్లి, జూలై 19: పర్యావరణ పరిరక్షణకు ఇంటింటా, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గృహిణులకు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని కోరారు. పట్టణంలో లక్ష్యానికి మించి మొక్కలను నాటుతామని, ఇప్పటికే నర్సరీలో అవసరమైన మొక్కలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో జాతీయ రహదారితో పాటు పలు ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, సిబ్బంది ముజీబ్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు నేతల పరామర్శ


మాజీ సర్పంచ్ గంగాధర్‌ను పరామర్శిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్, జూలై 19: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. దూలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుండారపు గంగాధర్ తండ్రి బక్కన్న అనారోగ్యంతో మృతిచెందగా ఆయనను పరామర్శించి బక్కన్న మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతకుంటలో ఇటీవల మృతిచెందిన అంబల్ల లింబాద్రి కుటుంబసభ్యులను మనోహర్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. వారి వెంట జడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ చైర్మన్ గుండారపు సౌజన్య, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు ఎంజీ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బొడ్డు బాలు, ప్రజాప్రతినిధులు, నాయకులు దయ్యి లక్ష్మీనర్సయ్య, మల్యాల రమేశ్, కొండ ఆంజనేయులు, సోమ దేవేందర్‌రెడ్డి, ఎండీ రఫీ, రాజారెడ్డి, శ్రీరాములు, వేణు, చెదలు సత్యనారాయణ, గంగాధర్, శంకర్, హరీశ్‌రెడ్డి, అరుణ్, భూమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మన్నెగూడెం జడ్పీ హైస్కూల్‌కు విరాళం

మేడిపల్లి, జూలై 17: భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కట్కం గిరి రూ.5,555 విరాళాన్ని బుధవారం ఎస్ఎంసీ చైర్మన్ అంకూస్, నర్సింహామూర్తికి అందజేశారు. విరాళం అందజేసిన కట్కం గిరిని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు చెన్నమనేని రవీందర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మల్లాపూర్, జూలై 19: వేంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ బూదమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ఆమె కుటుంబ సభ్యులకు స్థానిక గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో దహన సంస్కారాలకు రూ. 10 వేల నగదును బుధవారం అందజేశారు. ఇక్కడ ఉప సర్పంచ్ రాజనర్సయ్య, నాయకులు బిట్ల నరేశ్, గుగ్గులావత్ రాజేందర్, గంగారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు


నర్సరీలో విరబూసిన గులాబీ మొక్కలు



అల్లమయ్య గుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన వన నర్సరీ ద్వారం

# హరితహారానికి సర్వం సిద్ధం

- పచ్చదనంతో చిట్టడవిని తలపిస్తున్న నర్సరీ
- 2.32 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం
- సంరక్షణకు ప్రత్యేక సిబ్బంది
- ప్రతి ఇంటికీ ఐదు మొక్కల పంపిణీ లక్ష్యం

కోరుట్ల, జూలై 19: కోరుట్లను హరిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు బల్దియా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా 2.12 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నర్సరీలో మొక్కలను సిద్ధం చేశారు. ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు, ప్రజలకు పంచేందుకు గతంలో చుట్టు పక్కల ఉన్న నర్సరీల నుంచి మొక్కలను తీసుకువచ్చారు. మొక్కల లభ్యత లేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం కష్ట సాధ్యమైంది. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుడదనే ఉద్దేశంతో శాశ్వత నర్సరీల్లో మొక్కల పెంపకానికి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మొక్కలను పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూములు, రహదారులకు ఇరువైపులా, పారిశ్రామిక ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల పరిసరాలు, ఇళ్ల ఆవరణలో, ప్రార్థనా మందిరాలు, ఆలయ ప్రాంగణాలు, పోలీస్‌స్టేషన్, రెవెన్యూ, రైల్వేస్టేషన్ పరిసరాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, నిరుపయోగంగా వున్న ప్రభుత్వ స్థలాల్లో మొక్కలను నాటించి పట్టణాన్ని పచ్చదనంతో నింపాలనే పట్టుదలతో మున్సిపల్ శాఖ కసరత్తు చేస్తుంది.

### పట్టణంలో ప్రత్యేక నర్సరీ ఏర్పాటు

పట్టణంలో హరితహారం విజయవంతం కోసం పట్టణ ప్రగతి నిధులతో అయ్యప్ప గుట్ట వద్ద ఎకరన్నర స్థల విస్తీర్ణంలో రూ.30 లక్షలు వెచ్చించి ప్రత్యేక నర్సరీని ఏర్పాటు చేశారు. ఇందులో 2.32 లక్షల మొక్కలను పెంచుతున్నారు. పశువుల నుంచి రక్షణకు నర్సరీ చుట్టూ ప్రత్యేక గోడను నిర్మించి గేట్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం మొక్కలకు నీరందించేందుకు బోరు బావిని తవ్వించి, మొక్కలకు ఎండ బారి నుంచి రక్షణ కోసం షెడ్ నెట్‌ను అమర్చారు. మొక్కలు చిన్నగా ఉండి నాటే సమయంలో చనిపోయే ప్రమాదం ఉందని విత్తనాలు మొలకెత్తే దశలోకి వచ్చిన తర్వాత మరింత రక్షణ కోసం పాలిథీన్ కవర్లోకి మార్చి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల సత్వర ఎదుగుదలకు కావాల్సిన నాణ్యమైన మట్టి, ఎరువుల మిశ్రమాన్ని కలిపి విత్తనాలను నాటించడం మొదలు పెట్టారు. దీంతో నర్సరీ పచ్చదనం పరుచుకొని చిట్టడవిని తలపిస్తున్నది.

### ప్రజలకు అందించేందుకు మొక్కలు సిద్ధం

హరిత లక్ష్యం శత శాతం చేరుకోవడమే లక్ష్యంగా మొక్కలను అందుబాటులో ఉంచారు. స్థానికంగా 2.50 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు నర్సరీల్లో 50 వేల మొక్కలను ఎక్కువ సంఖ్యాలో నిల్వ ఉంచారు. ప్రజలకు పంపిణీ చేసేందుకు మూడు నర్సరీల్లో పూలు, పండ్లు, నీడనిచ్చే సుమారు 30 రకాల మొక్కలు జామ, అల్లనేరేడు, చక్ర మల్లె, మందారం, నేరేడు, మల్లె, చామంతి, కోనా కార్పస్, వాటర్ అపిల్, గన్నేరు, నూరు వరహాలు, గోరింటా, గులాబీ, గుల్‌మోహర్, పెల్టో ఫోరం, దానిమ్మ, కానుగ, పారిజాతం, టెకోమా, శ్రీగంధం, నెమలి నారా, వేప, టేకు, కదంబా, నిద్ర గన్నేరు, బాదం, బోహమియా, స్పతోడియా, చింత, సీతాఫలం, నరేపా, సిల్వియా వంటివి పంపకానికి సిద్ధంగా ఉంచారు.


షెడ్ నెట్ కింద పెంచుతున్న మొక్కలు

### పట్టణాన్ని హరితమయం చేయడమే లక్ష్యం

కోరుట్ల పట్టణాన్ని హరితమయం చేయడమే లక్ష్యంగా ముందుకువెళ్తాం. ఈసారి ఇంటింటికీ ఐదు గులాబీ మొక్కలు అందించనున్నాం. పట్టణానికి హరిత శోభ తెచ్చేందుకు ప్రజలందరి భాగస్వాములను చేస్తాం. స్థానికంగా ఉన్న యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాం. ప్రజలకు ఏడాది పాటు మొక్కలను అందించేందుకు నర్సరీల్లో ఎక్కువ మొక్కల పెంపకాన్ని చేపడుతూ. నర్సరీల్లో మొక్కల సంరక్షణ కోసం మున్సిపల్ నుంచి 10 మంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించాం. వర్షాకాలం ప్రారంభమైన వెంటనే ప్రతి ఇంటి ఆవరణలో ఐదు మొక్కలు నాటేందుకు ప్రజలకు పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. పట్టణ నర్సరీలో ఆరు అడుగుల మేర పెంచిన వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఏపుగా పెరిగిన మొక్కలు తొందరగా నాటుకుంటాయి. మొక్కల కొనుగోలుకు గతంలో లక్షల్లో నిధులు వెచ్చించాల్సి వచ్చేది. పట్టణ నర్సరీ ఏర్పాటుతో నిధులు ఆదా కావడంతో పాటు నాణ్యమైన మొక్కలు అందుబాటులోకి వచ్చాయి.

\- మహ్మద్ అయాజ్, మున్సిపల్ కమిషనర్ (కోరుట్ల)

# కార్యదర్శుల పనితీరుపై క్షేత్రస్థాయి పరిశీలన

కోరుట్ల రూరల్, జూలై 19: కోరుట్ల మండలంలోని సంగెం గ్రామంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పనితీరును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాల్లో చేపట్టిన పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 8 అంశా ల్లో పనితీరు ఆధారంగా ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసును క్రమబద్ధీకరిస్తుందన్నారు. జిల్లాలో 281 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉండగా 183 మంది నాలుగు సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్నా రని వివరించారు. క్షేత్రస్థాయిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరును పరిశీలించేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పరిషత్ అధికారి, అటవీ రేంజ్ అధికారి, వ్యవసాయ అధికారుల ద్వారా మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. మౌలిక సదుపాయాలు, వంద శాతం పన్నుల వసూళ్లు, నర్సరీలు, మొక్కల సంరక్షణ, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ల నెలవారీ వాయిదాల చెల్లింపులు, పది శాతం గ్రీన్ బడ్జెట్ వినియోగం, ఇంటింటి చెత్త సేకరణ, జనన, మరణ ధ్రు వీకరణ పత్రాల నిర్వహణ వంటి అంశాల్లో వంద మార్కులతో పనితీరును పర్యవేక్షిస్తారని తెలిపారు. మండల స్థాయి నివేదికలను జిల్లాస్థాయి కమిటీ పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, సర్పంచ్ చెప్యాల నర్సయ్య, ఆర్‌బీఎస్ గ్రామాధ్యక్షుడు సుధవేని భూమయ్య, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, డీఎల్‌పీవో శంకర్, ఫారెస్ట్ అధికారి వెంకటేశ్వర్లు, ఏవో నాగమణి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో లక్ష్మయ్య, కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.


వాల్గొండ ఎస్టీ తండాలో రికార్డులను పరిశీలిస్తున్న దివాకర్

మల్లాపూర్, జూలై 19: వాల్గొండ ఎస్టీ తండా, కొత్తదాంరాజ్‌పల్లి గ్రామాల్లోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పనితీరును అదనపు కలెక్టర్ దివాకర్ పరిశీలించారు. గ్రామాల్లోని పల్లె ప్రగతి పనుల్లో భాగంగా చేపట్టిన డంప్ యార్డులు, శానిటేషన్, వన నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల పని విధానంపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీపీవో దేవరాజ్, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కాటిపల్లి సరోజన, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో జగదీశ్, ఏవో లావణ్య, సర్పంచులు ధరంసోత్ కళావతి, బద్దం సరిత, పంచాయతీ కార్యదర్శులు సాయికుమార్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## వినతి పత్రం అందజేత

కోరుట్ల, జూలై 19: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ అయాజ్‌కు తెలంగాణ బహుజన గళం ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. బీసీల రిజర్వేషన్ల పితామహుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ విగ్రహాన్ని పట్టణ కూడలిలో ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్ గౌడ్, మహ్మద్ జానీ, రహీం, రాజు, సాయి, రాజేందర్‌గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతం చేయాలి

కొడిమ్యాల, జూలై 19: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులి పురుగుల నిర్మూలనపై వైద్యులు నరేశ్, పరమేశ్వరి బుధవా రం ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ, 1 నుంచి 19 సంవత్సరాల లోపు గల వారికి మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఈ మాత్రలు నేరుగా మింగకుండా 1 నుంచి 2 సంవత్సరాల వారికి సగం మాత్రను పొడర్ చేసి నీటిలో కలిపి తాగించాలని, 2 నుంచి 3 సంవత్సరాల వారికి ఒక మాత్రను పొడర్ చేసి నీటిలో కలిపి తాగించాలన్నారు. 3 నుంచి 19 సంవత్సరాల వారికి నమిలిన తర్వాత మింగించాలన్నారు. రెండో విడుతగా 27న పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.